క్లుప్తంగా

అలకరించిన ముగ్గుల పోటీలు


ముగ్గుల పోటీల్లో పాల్గొని మహిళలు

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల పట్టణ పరిధిలోని మహేశ్వరనగర్-2 , రెడ్డినగర్ కాలనీల్లో వినాయక ఉత్సవాలు ఘనంగా జరిగాయి. సోమవారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ముగ్గల పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థానంలో లక్ష్మీతేజ, ద్వితీయ స్థానంలో సాయిలక్ష్మి, హరిత, తృతీయ స్థానంలో పద్మవతి, ప్రసన్న నిలిచారు. విజేతలకు కమిటీ నిర్వహకులు బహుమతులు అందజేశారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


పరీక్షిస్తున్న వైద్యులు

ఎర్రగుంట్ల : చిలంకూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్షిత అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం గర్భిణులకు వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ సాయిచరిత రెడ్డి, డాక్టర్ గణేష్‌రెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు అందజేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిలంకూరు వైద్య సిబ్బంది పాల్గొన్నారు

గంగమ్మ ఆలయ హుండీ లెక్కింపు


ఆలయ హుండీని లెక్కిస్తున్న అర్చకులు, అధికారులు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట బుగ్గలేటిపల్లి సమీపంలోని గంగమ్మ తల్లి ఆలయ హుండీని సోమవారం లెక్కించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ జనార్దన్‌తోపాటు ఆలయ కార్య నిర్వహణ అధికారి పి సురేష్‌కుమార్‌రెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంగమ్మ ఆలయ హుండీ ద్వారా మూడు నెలలకు సంబంధించి 63,807 రూపాయలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బందితో పాటు ధర్మకర్తలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లింగాల: లింగాల మండల కేంద్రంలోని చిన్నకుడాల 33/11కెవి ఫీడర్ పరిధిలోని దొండ్లవాగు, తేర్నాంపల్లి సబ్‌స్టేషన్‌ల పరిధిలో మరమత్తుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ ఏఈ రమేష్‌బాబు తెలిపారు. మంగళవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


నిండుకుండలా మైలవరం జలాశయం

జమ్మలమడుగు: మరో మూడు రోజుల్లో పెన్నానదికి భారీగా వరద నీరు విడుదల చేయబోతున్నట్లు మైలవరం ఇరిగేషన్ ఏఈ గౌతం రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం వారం రోజుల నుంచి పెన్నానదిలో రోజుకు ఐదువందల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని, ఇప్పుడు వెయ్యి క్యూసెక్కుల నీటిని విడదల చేస్తున్నామని తెలిపారు. మంగళవారం మూడువేల క్యూసెక్కులు, బుధవారం ఐదు వేల క్యూసెక్కులు, గురువారం 8,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని ప్రకటించారు. కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టు నుంచి భారీగా వరదనీరు గండికోట జలాశయానికి చేరుకుంటుంది. గండికోటలో పూర్తి స్థాయిలో 25టీఎంసీల నీరు నిల్వ ఉండగా మైలవరం జలాశయంలో 5.5 టీఎంసీల నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమం

కడప కల్చరల్ : కడప నగరం బెల్లంమండీవీధిలోని శ్రీ ప్రసన్న విఘ్నేశ్వరస్వామి ఆలయంలో వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని మూడు రోజులుగా ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. మూడవరోజు ఆలయం వద్ద అర్చకులు చంద్రమౌళిశర్మ నిర్వాహకులు వాంఛ కల్పలత వైనాయకి హోమాన్ని భక్తులచే నిర్వహింపజేశారు. ఆలయం ఎదురుగా హోమ గుండాలను ఏర్పాటు చేసి దంపతులు, కుటుంబ సభ్యులు సంప్రదాయ దుస్తుల్లో హాజరై హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు స్థానిక భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు.

ఉంటామయ్యా.. ఉండ్రాళ్లయ్యా..!

- కోలాహలంగా నిమజ్జన వేడుకలు
- ఉత్సాహంగా పాల్గొన్న ప్రజలు


పులివెందుల టౌన్ : ఊరేగింపులో పాల్గొన్న మహిళలు, యువకులు



పులివెందుల టౌన్ : నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు

సింహాద్రిపురం: ఉండ్రాళ్లయ్యా.. ఉంటామయ్యా అంటూ మూడవ రోజు సోమవారం సింహాద్రిపురం మండల వ్యాప్తంగా గ్రామాలలో కొలువుదీరిన గణనాథులను చెక్కభజనలు, కోలాటాల నడుమ గ్రామంలో భక్తిశ్రద్ధలతో ఊరేగించి సమీపంలోని గంగలో నిమజ్జనం చేశారు. మండల వ్యాప్తంగా మూడవరోజు వినాయక ప్రతిమల వద్ద ఘనంగా పూజలు నిర్వహించారు. వాడవాడల మండపాలు ఏర్పాటు చేసి వివిధ రూపాలలో గణనాథులను కొలువుదీర్చారు. చెక్కభజనలు, కోలాటాలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విఘ్నేశ్వరుడికి రకరకాల నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎస్ఐ తులసినాగప్రసాద్ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా నిమజ్జనం

వీరపునాయునిపల్లె: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం వినాయకుని నిమజ్జనోత్సవం వైభవంగా సాగింది. ఘననాథుని ప్రతిమల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు విగ్రహాల వద్ద అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అత్యంత సుందరంగా అలంకరించిన ట్రాక్టర్లపై వినాయక విగ్రహాలను ఉంచి భారీగా బాణసంచా పేలుస్తూ, డప్పు వాయిద్యాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు.

లడ్డూ వేలం

వినాయక చవితి పండుగను పురస్కరించుకొని వినాయకుని ప్రతిమల వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లడ్డూ వేలం పాటలో యువకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. బోగాదమ్మ తల్లి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను వీరపునాయునిపల్లెలోని సంగమేశ్వర ఉన్నత పాఠశాలకు ఉపాధ్యాయుడు నర్రెడ్డి బ్రహ్మానందరెడ్డి కుమారుడు హితేష్‌రెడ్డి రూ. 54 వేలకు దక్కించుకొన్నారు. గంగిరెడ్డిపల్లెలో వినాయకుడి లడ్డూను నర్రెడ్డి సుధాకర్‌రెడ్డి రూ. 52 వేలకు దక్కించుకున్నారు.

అట్టహాసంగా నిమజ్జనం

జమ్మలమడుగు: పట్టణంలో గణేశుని నిమజ్జనోత్సవాన్ని సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. పెద్దముడియం మండలం కేంద్రానికి సమీపంలో ఉన్న కుందూ నదిలో విగ్రహాల నిమజ్జనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలీసులు ఇచ్చిన సమయం ప్రకారం నిమజ్జనం కోసం వినాయక విగ్రహాలను కమిటీ సభ్యులు తరలించారు. ఈ ఏడాది డీజేలు లేకపోవడంతో బాణాసంచా పేల్చుకుంటూ.. నృత్యాలు చేసుకుంటూ భక్తులు ఉత్సాహంగా తీసుకు వెళ్లారు.

లింగాల మండలంలో..

లింగాల: లింగాల మండలం గుణకనపల్లె గ్రామంలోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని లడ్డూ వేలం భారీ ధర పలికింది. ఈ వేలంలో గ్రామానికి చెందిన సురేష్‌రెడ్డి రూ.31,100లకు 5 కేజీల లడ్డూను వేలం పాటలో కై వసం చేసుకున్నారు. వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనను సత్కరించి మేళతాళాలతో వైభవంగా ఊరేగించారు.

ఘనంగా వినాయకుని నిమజ్జన వేడుకలు

వేముల: మండల వ్యాప్తంగా సోమవారం వినాయకుని నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామాల్లో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసి వినాయకుని ప్రతిమలను కొలువుదీర్చారు. మూడురోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడవరోజు డప్పువాయిద్యాలు, కోలాటాలు, చెక్కభజనలతో వినాయకుని నిమజ్జనం చేశారు. నిమజ్జనం సందర్భంగా యువతీ యువకులు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా నిమజ్జనంలో పాల్గొన్నారు.

రూ.50వేలు పలికిన లడ్డూ

మండలంలోని చిన్నగొందిపల్లె గ్రామంలో వినాయకుని లడ్డూ ప్రసాదం వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో గ్రామానికి చెందిన చెల్లుబోయిన రమణయ్య రూ.50 వేలకు వినాయకుని లడ్డూను వేలం పాటలో దక్కించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో నిమజ్జనం

వేంపల్లి : మండల వ్యాప్తంగా వినాయకుని నిమజ్జనం భక్తిశ్రద్ధలతో ఆలయ కమిటీ నిర్వాహకులు నిర్వహించారు. మూడు రోజులు పాటు వినాయకునికి నైవేద్యం సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాడవాడలో ఏర్పాటుచేసిన వినాయకుని ప్రతిమలను దాదాపు సోమవారం నందిపల్లె, పాలగిరి తదితర నీరు ఉన్న ప్రాంతాల్లో నిమజ్జనం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు.

ఘనంగా గణనాథునికి వీడ్కోలు

పులివెందుల రూరల్: పులివెందుల మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె, కొత్తపల్లె, ఎర్రబల్లె, మల్లికార్జునపురం, తుమ్మలపల్లె గ్రామాల్లో ఘననాథునికి ఘనంగా వీడ్కోలు పలికారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మూడు రోజుల పాటు బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించి.. గణేష్ మహరాజుకి జై.. గణపతి పప్పా మోరియా అంటూ ఘనంగా వీడ్కోలు పలికారు. అలాగే తుమ్మలపల్లె గ్రామంలో వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు.

హోరెత్తిన నిమజ్జనం

కమలాపురం: మూడు పాటు ఆధ్యాత్మిక సందడి చేసిన వినాయక ఉత్సవాల పర్వం నిమజ్జనంతో ముగిసింది. సోమవారం కమలాపురం పట్టణంతో పాటు మండలంలోని గంగవరం, విభరాపురం, అప్పాయపల్లె, పెద్దచెప్పలి, చిన్నచెప్పలి, చదిపిరాళ్ల, పందిళ్లపల్లె తదితర గ్రామాలలో గణేష్ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఏర్పాటు చేసి ఊరేగింపు నిర్వహించారు. 'గణపతి పప్పా మోరియా.. మంగళమూర్తి మోరియా.. గణేష్ మహరాజ్‌కి జై' అంటూ భక్తుల మిన్నంటే నినాదాలతో ఉత్సాహంగా నిమజ్జనోత్సవం సాగింది. కాగా కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్ పర్యవేక్షణలో ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి పోలీస్ సిబ్బందితో కలసి కందూ నది వద్ద బందోబస్తు నిర్వహించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

పులివెందులలో..

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మూడవ రోజు సోమవారం వినాయక నిమజ్జన వేడుకలు కోలాహలంగా జరిగాయి. పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం కార్యాలయం వద్ద ఉదయం అన్నదానం నిర్వహించి సాయంత్రం కన్నుల పండువగా వినాయకుని గ్రామోత్సవం నిర్వహించారు. డప్పు వాయిద్యాల మధ్య యువకులు చిందులేస్తూ వినాయకుడిని నిమజ్జనానికి తరలించారు. అలాగే యర్రగుడిపాలెం గిరి హోటల్ యజమాని గిరి ఏర్పాటు చేసిన వినాయకుని ప్రతిమ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే రాణితోపు వద్ద ఉన్న ఏపీఎస్పీడీసీఎల్ ఉద్యోగులు ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద లైన్‌మెన్ గుంటా హేమచంద్ర రూ.16వేలకు లడ్డను వేలంపాటలో దక్కించుకున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో కొలువుదీరిన వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.

ఘనంగా వినాయక నిమజ్జన వేడుకలు

తొండూరు: తొండూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొండూరు, తుమ్మలపల్లి, తేళ్లూరు, ఇనగలూరు, సైదాపురం, మడూరు, కృష్ణంగారిపల్లి, అగడూరు, తదితర గ్రామాల్లో పోలీసుల బందోబస్తు మధ్య వినాయకుని నిమజ్జన వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. గణనాథుని నిమజ్జన ఊరేగింపులో కోలాటం, కర్రసాము, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలుపలువురిని ఆకట్టుకున్నాయి. డీఎస్పీ మురళీనాయక్ ఆదేశాల మేరకు తొండూరు ఎస్ఐ పెద్ద ఓబన్న ప్రత్యేకంగా పర్యవేక్షించారు. అనంతరం వినాయకుని ప్రతిమలను ఇనగలూరు సమీపంలోని మొగమూరు వాగులో నిమజ్జనం చేశారు.

వైభవంగా గణనాథుని నిమజ్జనం

పెండ్లిమర్రి: వినాయక చవితి పర్వదినం సందర్భంగా మండలంలో పగడాలపల్లె, దాసరిపల్లె, కొత్తసంగటిపల్లె, నాగాయపల్లె, తిప్పరాజుపల్లె, ఎం.కొత్తపేట తదితర గ్రామాలల్లో శనివారం ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు మూడు రోజుల పాటు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి సోమవారం వైభవంగా నిమజ్జనం చేశారు. విగ్రహాలను ఉత్సవ కమిటీ వారు యువకుల కేరింతల నడుమ బాణసంచా పేల్చుకుంటూ నిమజ్జనం చేశారు. విగ్రహాలు ఉంచిన వాహనాల ఊరేగింపు ముందు భాగంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు ముందు జాగ్రత్తలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

వల్లూరు మండలంలో..

వల్లూరు: మండలంలోని పలు గ్రామాల్లో గణేశుని నిమజ్జనం కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. శనివారం వినాయకుని విగ్రహాలను కొలువు దీర్చి.. మూడు రోజుల పాటు పూజలు నిర్వహించి నిమజ్జనం చేశారు. గణేష్ మహరాజ్‌కీ జై అంటూ ఆనందోత్సాహాలతో నిమజ్జనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువకులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అడుగడుగునా ఊరేగింపులోని విగ్రహాలకు హారతి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు.


వీరపునాయునిపల్లె: గ్రామోత్సవంలో ఘననాథులు


జమ్మలమడుగు: నిమజ్జనానికి తరలిపోతున్న వినాయక విగ్రహాలు


లింగాల: వేలంపాటలో దక్కించుకున్న లడ్డూను ఊరేగింపుగా ఇంటికి తీసుకెళ్తున్న సురేష్‌రెడ్డి కుటుంబ సభ్యులు


పులివెందుల రూరల్: నిమజ్జనానికి తరలిస్తున్న బొజ్జ గణపయ్య


తొండూరు: మొగమూరు వాగులో గణనాథుని నిమజ్జనం చేస్తున్న భక్తులు, పోలీసులు


వేముల: కోలాటం ఆడుతున్న యువతీయువకులు


సింహాద్రిపురం: నిమజ్జనానికి వినాయకుడిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు


కమలాపురం: నిమజ్జనానికి ప్రత్యేక వాహనంలో గణనాథుడిని తరలిస్తున్న భక్తులు


వల్లూరు: పెద్దపుత్తలో గణేశుని గ్రామోత్సవం

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే వరద ముప్పు

- ముందస్తు హెచ్చరికలు ఉన్నా జాగ్రత్తలు ఏవీ?
- ప్రభుత్వ అసమర్థతతో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం
- బాధితులకు సాయమందించడంలోనూ విఫలం
- వైఎస్ఆర్‌సీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పి. నరేన్ రామాంజులురెడ్డి



వల్లూరు: బుడమేరు వరద గురించి ఐఎండీతో పాటు సంబంధిత శాఖలు ముందస్తుగానే ప్రభుత్వానికి సమాచారం ఇచ్చి ముప్పు గురించి హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్లనే విజయవాడ ముంపునకు గురై భారీగా ప్రాణ, ఆస్తి నష్టం జరిగినట్లు కమలాపురం నియోజకవర్గ వైఎస్ఆర్‌సీపీ ఇన్‌చార్జి పి. నరేన్ రామాంజులురెడ్డి అన్నారు. సోమవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ ఆగస్టు 30 నుంచి భారీ వర్షాలు కురుస్తాయని, దాని కారణంగా వరద ముప్పు పొంచి ఉందని ప్రభుత్వానికి సమాచారం ఉన్నప్పటికీ ముందస్తు చర్యలు తీసుకోవపోవడంతో ఇంతటి నష్టం వాటిల్లిందని విమర్శించారు. సకాలంలో స్పందించి నీటి పారుదల, రెవెన్యూ, పోలీసు తదితర శాఖలను రంగంలోకి దింపి దిశా నిర్దేశం చేయడం ద్వారా ప్రజలను అప్రమత్తం చేసి ఉంటే ఇంతటి విపత్తు జరిగేది కాదన్నారు. పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించాల్సిన ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. వరద వచ్చి 9 రోజులు గడుస్తున్నా బాధితులకు ఇప్పటికీ సాయం అందక పోవడం బాధాకరమని పేర్కొన్నారు. సాయమందక బాధితులు పెడుతున్న ఆకలి కేకలు, నిరాశ, నిస్పృహలు, వారు గడుపుతున్న తీరును సామాజిక మాధ్యమాలు, పత్రికల్లో చూస్తుంటే కడుపు తరరుక్కుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి అ.ధికారిక నివాసం, ఆంధ్రజ్యోతి ఎండీ రాధా కృష్ణ పవర్ ప్లాంటు మునిగి పోకుండా కాపాడేందుకే బుడమేరు నుంచి నీటిని వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా విజయవాడ మీదకు వదలడం ద్వారా ఇంతటి ఘోర పరిస్థితి తలెత్తిందని విమర్శించారు. 30 ఏళ్ల ఇండస్ట్రీ, 14 ఏళ్ల పాలనానుభవం అంటూ పదే పదే చెప్పుకునే సీఎం చంద్రబాబు విజయవాడ నగరంలో వరదల్లో చిక్కుకున్న ప్రజలను పూర్తి స్థాయిలో ఆదుకోలేక పోయారంటే ఆయన దక్షత ఏపాటిదో అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. సహాయక చర్యల్లో సీఎంతో బాటు టీడీపీ నాయకులది ప్రచార ఆర్భాటం, హడావుడీ తప్ప బాధితులను ఆదుకున్న పాపాన పోలేదని అన్నారు. వైఎస్ఆర్ సీపీ పాలనతో ఏర్పాటైన వలంటీర్లను సహాయక చర్యల్లో వినియోగించి ఉంటే ప్రజలకు కొంతైనా ముప్పు నుంచి ఉపశమనం కలిగిగేదన్నారు. అమరావతి నిర్మాణానికి గానీ, రాష్ట్రంలో తలెత్తే విపత్కర పరిస్థితులకు కేంద్రం నుంచి సహాయ సహకారాలను, నిధులను ఎందుకు పొందలేక పోతున్నారో టీడీపీ నేతలే జవాబు ఇవ్వాల్సి ఉందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన పేర్కొన్నారు.

వక్ఫ్ బోర్డు పరిధిలోనే ఆస్తులుండాలి


మాట్లాడుతున్న ఆప్ జిల్లా కోఆర్డినేటర్ రహంతుల్లా

వేంపల్లి: వక్ఫ్ బోర్డుకు సంబంధించిన ఆస్తులు ఆ బోర్డు పరిధిలోనే ఉండాలని ఆమ్ ఆద్మీపార్టీ జిల్లా కో ఆర్డినేటర్ రహంతుల్లా డిమాండ్ చేశారు. సోమవారం ఆప్ నాయకులతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు రద్దు బిల్లుకు వ్యతిరేకంగా ప్రజల్లోకి తీసుకెళ్తామని ప్రకటించారు. దేశంలోని ముస్లింల హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. వక్ఫ్ బోర్డు రద్దు బిల్లును ఇండియా కూటమి వ్యతిరేకిస్తోందని తెలిపారు. ప్రతి పౌరుడు రిజెక్ట్ ది వక్ఫ్ బోర్డు బిల్లుకు అనుకూలంగా ఇమెయిల్ ద్వారా పార్లమెంటు సెషన్‌కు పంపాలని కోరారు. ఐక్యమత్యమే మహాబలం అని ఎందరో మహానీయులు వారి ప్రాణాలు త్యాగం చేశారని పేర్కొన్నారు. వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఎర్రగుంట్ల: యర్రగుంట్ల పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని వినాయకనగర్ కాలనీలో లారీలో సుమారు 288 బస్తాల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా లారీతో పాటు ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు కడప రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీనివాసరావు, డిప్యూటీ తాహసీల్దార్ తేజేస్వీ తెలిపారు. లారీని సీజ్ చేసి ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

సింహ వాహనంపై శ్రీరంగనాథుడు


సింహవాహనంపై స్వామి వారు

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో నూలు పూజ పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజైన సోమవారం శ్రీరంగనాథుడు సింహ వాహనంపై సతీసమేతంగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు కృష్ణరాజేష్‌శర్మ ఉభయదారులచే ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. 9 రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తరించారు. వన భోజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమాలను ఈఓ కేవీ రమణ పర్యవేక్షించారు.

కమలాపురం చెరువుకు నీరివ్వాలి

కడప సెవెన్‌రోడ్స్ : మైలవరం రిజర్వాయర్ దక్షిణ కాలువ ద్వారా కమలాపురం చెరువుకు నీరు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎంవీ సుబ్బారెడ్డి, నాయకులు టి.రామ్మోహన్‌రెడ్డి, కట్టా యానాదయ్య, జి.నాగేశ్వరరావులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులను కలిసి సమస్యలను విన్నవించారు. ఈ యేడు పాపాఘ్ని నదికి నీరు రాలేదన్నారు. పాపాఘ్నికి నీరు వస్తే కమలాపురం, చదిపిరాళ్ల చెరువులకు నీరందే పరిస్థితి ఉండేదన్నారు. వర్షాలు లేకపోవడం వల్ల పాపాఘ్నిలో నీరు లేక రెండు చెరువులు ఎండిపోయి ఉన్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో మైలవరం జలాశయం దక్షిణకాలువ ద్వారా కమలాపురం చెరువును నీటితో నింపితే తాగు, సాగునీరు అందుతుందన్నారు.

రాజకీయాలకు అతీతంగా కృషి చేయాలి

పులివెందుల టౌన్ : పులివెందులు మెడికల్ కాలేజీ అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జేసీఎస్ ఇన్‌చార్జి పార్నపల్లి కిషోర్ కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల ప్రాంతానికి, రాయలసీమ ప్రాంతానికి చెందిన విద్యార్థులు మన ప్రాంతంలోనే మెడికల్ విద్యను అభ్యసించాలనే ఉద్దేశ్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి చొరవతో మెడికల్ కళాశాలను శరవేగంగా నిర్మించారని తెలిపారు. అయితే సార్వత్రిక ఎన్నికల ముందు కళాశాలకు అధ్యాపక, అధ్యాపకేతర ఫ్యాకల్టీని నియమించి 150 సీట్లకు ప్రవేశాలు కల్పించేలా గత ప్రభుత్వం చర్యలు తీసుకుందని గుర్తుచేశారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మెడికల్ కళాశాల ఎన్ఎంసీ బృందాలు పరిశీలన అనంతరం వైద్య సీట్ల ప్రవేశాల అనుమతులకు నీలి నీడలు కమ్ముకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్ కుమారస్వామి గుప్తా

వేంపల్లి : ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికై నట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. ఆర్కేవ్యాలీ క్యాంపస్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో తమ కళాశాలలో చదువుతున్న కావ్య, సువర్ణ, సాయి హర్షిత, వైష్ణవి, అనుశ్రీ, మహబూబ్ భాషా, శివ, రాకేష్, కిషోర్, కొండయ్య, కృష్ణ సాయితోపాటు వేంపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న గిరీశా తివారిఅత్యంత ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 14, 15వ తేదీన కోనసీమలో జరిగే రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో కడప జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. కళాశాల విద్యార్థులు ఎంపిక కావడం పట్ల డైరెక్టర్‌తో పాటు అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేసి విద్యార్థులను అభినందించారు. రాష్ట్రస్థాయిలో కూడా మంచి ప్రతిభను కనబరిచి అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

పత్తిలో గులాబి రంగు పురుగును నివారించండి


పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పెండ్లిమర్రి: పత్తి పంటను తీవ్రంగా నష్టపరిచే గులాబీ రంగు పురుగు నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ రమణారెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ వీరయ్య సూచించారు. సోమవారం మండలంలోని తిప్పిరెడ్డిపల్లె గ్రామ పొలాల్లో పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గులాబీ రంగు పురుగు నివారణకు ప్రొఫినోఫాస్ లేదా క్లోరిపైరిఫాస్ రెండు మిల్లీలీటర్లు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే అలాగే పత్తిని తీవ్రంగా నష్టపరిచే గులాబీ రంగు పురుగు ఉనికిని గమనించేందుకు ఎకరాకు నాలుగు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
MAHINDRA FURIO16 20TH HSD SLR
CABIN BS6 2022 MODEL AP39 UH 6397
Engine No : CMN4F98469
Chassis No : MA1JACMWFN6H72447
Cell: 88864 18983
D.No: 14-245, 1st Floor, IVR Towers, Beside Sai Baba School, ITI Circle, KADAPA.